క్లుప్తంగా

ఘనంగా తమలపత్ర పూజ

జగ్గంపేట: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం తమలపత్ర సిందూరపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గత ఐదు రోజులుగా స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా చివర రోజు శనివారం కూడా మహిళలు సుందరకాండ పారాయణ, పూజలను చేశారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు జీనుమణిబాబు, దాట్ల సురేష్‌రాజు, గెడ్డమూరి బాబ్జి, కోడూరి రమేష్, పి.టి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, అట్టల పంపిణీ

ఏలేశ్వరం: టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. పెద్దనాపల్లి గ్రామంలో శనివారం సీతాఈశ్వరీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, గొల్లపల్లి చిన్నా ఆధ్వర్యంలో మండలంలోని పదో తరగతి విద్యార్థులు 302 మందికి పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు. అలాగే మండల వ్యాప్తంగా టెన్త్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన వారికి ట్రస్టు తరుపున ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓ అబ్బాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం: యర్రవరం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శన ఆకట్టుకుంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ఒక ఏడాదిలోపు పుట్టిన 40 లేగ దూడలను ప్రదర్శనలో పెట్టారు. వీటిలో ప్రథమ బహుమతి కరణం వెంకటేశ్వరరావు, ద్వితీయ బహుమతి తోట అబ్బాయి, తృతీయ బహుమతి అడ్డాల వీరబాబులకు చెందిన లేగ దూడలు గెలుచుకున్నాయి. పోటీలో దూడలకు ఏలిక పాముల నివారణ, బ్రూసెల్లా వ్యాక్సిన్లు వేశారు. అనంతరం పాడి రైతులకు కాల్షియం, లివర్ టానిక్స్, మినరల్ బ్లాక్స్ అందజేశారు. తొలుత ప్రదర్శనను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రైతులకు కోరారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సహాయ సంచాలకులు చిక్కం బాలచంద్ర యోగీశ్వర్, వైద్యులు వరలక్ష్మి, సతీష్‌కుమార్, మంజూష, కల్యాణి సిబ్బంది పాల్గొన్నారు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆడిట్

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్ జరిగినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.కె.మెహర్ శనివారం రాత్రి తెలిపారు. ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు కాకినాడ పీఆర్, కళాశాలకు చెందిన జి.పి.చక్రవర్తి, కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కె.ఎస్.ఎన్ ప్రసాద్ బృందం రెండేళ్లకు సంబంధించి వివిధ రికార్డులు పరిశీలించారు. కళాశాల అభివృద్ధి, అకడమిక్స్ సంబంధించి పలు సూచనలు చేశబూరు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దివాకర్, అకడమిక్ కోఆర్డినేటర్ పి.వి.కృష్ణారావు తదితరులు ఉన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయని ఎంపీడీఓ గోవిందు అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి, కొత్తపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలు, ఎరువుల గుంతల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. మిగిలిన నిర్మాణాలను ఈనెలాఖరు నాటికి పూర్తి చేస్తామని ఏపీఓ అప్పలరాజు తెలిపారు.

పదింతల ఆనందంతో..

- పది పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులు
- ప్రణాళికాబద్ధంగా శిక్షణా తరగతులు
- ప్రత్తిపాడు మండలంలో 1,483 మంది విద్యార్థులు
- రేపటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు



ప్రత్తిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

ప్రత్తిపాడు: విద్యార్థులకు పదో తరగతే తొలి మెట్టు. తొలి అడుగే సరిగా పడితే భవిష్యత్ అంతా బాగుంటుంది. అందుకు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎంతో శిక్షణను ఇచ్చారు. విద్యార్థులంతా పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. అందుకు విద్యాశాఖ కూడా సన్నద్ధమైంది. పదో తరగతి పరీక్షలకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేస్తోంది.

పదో తరగతి విద్యార్థులు ఏడాది అంతా చదువుకున్న పాఠాలు మళ్లీ నెమరు వేసుకుని పబ్లిక్ పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యారు. పదికి పది జీపీఏ లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలతో చదివి ముందుకు వెళుతున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చదువులో పూర్తిగా వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి శిక్షణనిచ్చారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి.

పది గ్రేడ్ పాయింట్లు సాధించే లక్ష్యంగా..

పదో తరగతి పరీక్షల్లో పది గ్రేడ్ పాయింట్లు సాధించే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేశారు. రెండు నెలల నుంచి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేశారు. రోజు వారీ పరీక్షలు నిర్వహించడమే కాకుండా వెనకబడ్డ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధకనబరిచారు. దీనిలో భాగంగా విద్యాశాఖ కూడా సబ్జెక్టుల వారీగా మెటీరీయల్‌ను అందించింది. చదివించేందుకు అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు.

మండలంలోని 14 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1,483 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ప్రత్తిపాడు, ధర్మవరం, లంపకలోవ, ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. తరగతి గదికి 20 నుంచి 24 మంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

పాఠశాలలు	విద్యార్థులు
జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు – 8	594
గిరిజన ఆశ్రమ పాఠశాల – 1	39
ప్రైవేటు పాఠశాలలు – 5	850

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పాఠశాలల్లో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. పరీక్షల వంద మార్కుల సాధన కోసం ప్రశ్నాపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుకు సులభమైన పద్ధతుల్లో బోధిస్తున్నారు. హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– వి.రాజబాబు, మండల విద్యాశాఖాధికారి, ప్రత్తిపాడు

షరా మామూలే



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ సామంతుల హైమావతి

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం షరామామూలే అన్నట్టుగా సాగింది. ప్రతినెలా సమావేశంలో జరుగుతున్న తంతు ఈసారీ జరిగింది. మున్సిపల్ కౌన్సిలర్లు పలు సమస్యలు ప్రస్తావించడం అధికారులు పరిష్కరిస్తామనడం సర్వసాధారణంగా మారింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ప్రతి సమావేశంలో సమస్యలు పరిష్కారించకుండా దాట వేస్తున్నారని నిలదీశారు. అధికారులు స్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. 15వ వార్డు కౌన్సిలర్ సుంకర హైమావతి పట్టణంలో కుక్కలు, కోతులు విపరీతంగా పెరిగిపోయాయని వాటిని అరికట్టాలని కోరారు. 12 వార్డు కౌన్సిలర్ సామంతుల హైమావతి మాట్లాడుతూ 2018లో జరిగిన పనులకు సంబంధించి బిల్లులను 2025లో ఆమోదానికి పెట్టడాన్ని ఖండించారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి అవినీతిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. చివరకు అజెండాను తిరస్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.సత్యనారాయణ, ఏఈ అనూష, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉష్ణతాపానికి ప్రజలు విలవిల



తుని పట్టణంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రోడ్డు

తుని: పెరుగుతున్న ఉష్ణతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఉదయం 11 గంటలకు వడగాల్పులు వీస్తున్నాయి. శనివారం పట్టణంలోని వ్యాపారులు మధ్యాహ్నం దుకాణాలు మూసివేసి సాయంత్రం తీస్తున్నారు. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరకు రసం, ఫ్రూట్ జ్యూస్‌లను ఆశ్రయిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో ప్రో కార్టింగ్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్ 2025 సీజన్–5 పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలియజేశారు. ఈనెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు జరుగు ఈ కార్యక్రమానికి ఏపీ తోపాటు తెలంగాణ, చెన్నై, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని విజేతలకు రూ.400,000 బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ అకడమిక్స్ ఎస్.రమాశ్రీ, రిజిస్టర్ జి.సురేష్, డీన్స్ ఎస్‌డీవీవీఎస్ భీమేశ్వరరెడ్డి, కో ఆర్డినేటర్స్ కె.నాగసురేష్, ఏ సీతారామమూర్తి, ఎం.శంకర్ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

ప్రత్తిపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా ఉండాలని ఆ పథకం ఏపీడీ భానుప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడులోని దేవులపల్లి వారి చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. వేతన దారులు చేసిన పనులను ఖచ్చితంగా నమోదు చేసి, వేతనాలను చెల్లించాలన్నారు. ఉపాధి పనుల కల్పనపై ఆయన వేతనదారులను ఆరా తీసారు. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మస్తర్ల నమోదులో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఆయన వెంట మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమారస్వామి తదితరులున్నారు.

ఎమ్మెల్సీకి బీజేపీ నేతల అభినందన

ప్రత్తిపాడు: పూర్వ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీగా ఎన్నికైన సోము వీర్రాజును రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహంలో శనివారం ప్రత్తిపాడు బీజేపీ నేతలు అభినందనలు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకర్గం నుంచి పార్టీ పూర్వ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సోము వీర్రాజును పూలమాలలతోనూ, శాలువాతోనూ సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పాపారావు, ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాల పార్టీ అధ్యక్షకార్యదర్శులు ఊటా సోమరాజు, జీజీ గోపాలస్వామి, లౌడు శ్రీనివాస్, ఎనుముల రాజా, నానిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



రాచపల్లిలో వైఎస్సార్ సీపీ నేతలతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. రాచపల్లిలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు అన్నివేళల అందుబాటు ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచి కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సారిపల్లి గంగరాజు, పెద్దిరెడ్డి నాని, సారిపల్లి గోవింద్, జక్కా త్రిమూర్తులు, మరోతు బాజ్జీ, ఒమ్ము రమణ తదితరులు పాల్గొన్నారు.

యనమల కృష్ణుడి పరామర్శ



ముసలయ్య కుటుంబసభ్యులను పరామర్శించిన వై కృష్ణుడు, మురళి తదితరులు

తొండంగి: ఎ.వి.నగరంలో ఇటీవల అకాల మరణం పొందిన రెండు కుటుంబాలను వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు శనివారం పరామర్శించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్త బొండాడ ముసలయ్య ఇటీవల మృతి చెందడంతో అతని కుమారుడు బొండా నాగార్జున ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇదే గ్రామంలో పిర్ల అప్పల నర్స మృతి చెందడంతో ఆమె కుమారుడు గణపతిని పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, యనమల కృష్ణ(ఎడ్ల పందాల కృష్ణ), గుల్ల చిన్న, శివకోటి లోవరాజు తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన రాయితీ రుణాలను ప్రభుత్వం అందిస్తుందని ఎంపీడీఓ కె.సాయి నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఈడబ్ల్యూఎస్ (ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రహ్మణ,) వర్గాలకు వయస్సు 21 నుంచి 60 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. కాపు సామాజిక వర్గానికి 21 నుంచి 50 సంవత్సరాలు లోపు వయస్సు ఉండాలన్నారు. రూ.రెండు లక్షల నుంచి రూ.ఎనిమిది లక్షలు వరకు ఖర్చయ్యే యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. 50 శాతం (రూ.75వేల నుంచి రూ.నాలుగు లక్షలు మించకుండ) రాయితీ పొందవచ్చన్నారు. మిగిలిన సొమ్ము బ్యాంకుల నుంచి రుణంగా పొందవచ్చన్నారు. రుణం పొందేందుకు వయస్సుతో పాటు రేషన్ కార్డు ఉండాలన్నారు. ఎంఎస్ఎంఈ పథకంలో రూ.25 లక్షలు వరకు యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. అందులో రూ.పది లక్షలు రుణం, రూ.పది లక్షలు రాయితీ, రూ.ఐదు లక్షలు లబ్ధిదారు వాటా ఉంటుందన్నారు. మహిళలకు టైలరింగ్‌లో 45 నుంచి 60 రోజులు, 90 రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందుకు అవసరమైన శిక్షణ కేంద్రాలను పట్టణ, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రైస్ కార్డు ఉన్న 21 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు ఆన్‌లైన్ (ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్)లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు ఈ నెల 22వ తేదీ ఆఖరువన్నారు.

భక్తులతో కిటకిటలాడిన కాట్రావులపల్లి

జగ్గంపేట: కాట్రావులపల్లి నూతనంగా ప్రతిష్ఠించిన షేంటేశ్వరస్వామి ఆలయానికి శనివారం వచ్చిన భక్తులతో గ్రామం కిటకిటలాడిపోయింది. విగ్రహ ప్రతిష్ఠ జరిగిన మొదటి శనివారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నసంతర్పణలో వేలాది మంది పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీరించారు.ఆలయ కమిటీ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసారు.

పరీక్షలకు విద్యార్థులు సిద్ధం



ప్రత్తిపాడులో పది పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధమయ్యారు. అందుకు అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభకానున్నాయి. ఈ పరీక్షలు ఈ నెల 31వ తేదీ వరకూ జరగనున్నాయి. మండలంలోని 14 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1,483 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ప్రత్తిపాడు, ధర్మవరం, లంపకలోవ, ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. తరగతి గదికి 20 నుంచి 24 మంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 594 మంది, పాండవులపాలెం ఆశ్రమ పాఠశాలలో 39 మంది, ఐదు ప్రైవేటు పాఠశాలల్లో 850 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పది పరీక్షల నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. గదుల్లో వెలుతురు, గాలి ఉండేలా చూశామన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

శంఖవరం: మండలంలో కత్తిపూడి జెడ్పీ హైస్కూల్, శంఖవరం జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, అన్నవరం దేవస్థానం స్కూళ్లలో 573 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ నెల 31 వరకు పరీక్షలు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అన్నవరం పోలీస్‌స్టేషన్ పోలీసులతో భద్రత కల్పించడం జరుగుతుందన్నారు.

బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు ఘన నివాళి

తుని రూరల్: బహుజన సమాజ్ వాదీ పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ డాక్టర్ కాన్షీరామ్‌కు ఆ పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. శనివారం హంసవరంలో బీఎస్పీ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి తంతటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాన్షీరామ్ 91వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా మార్గంలో పార్టీని నడిపించి, బహుజనుల రాజ్యస్థాపనకు కృషి చేశారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పోరాటాలు చేశారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి రాజబాబు, నాయకులు కర్రి నూకరాజు, చెక్క భీమరాజు, ఎం.వీరబాబు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఏలేశ్వరం: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు రాశారు. పరీక్షలకు 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు ఉదయం నుంచి 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

30 మంది గైర్హాజరు

కిర్లంపూడి: ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాతంగా ముగిశాయి. కిర్లంపూడి ప్రభుత్వ, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలకు 845 మంది హాజరు కావల్సి ఉండగా 815 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరైనట్టు సీఎస్‌లు కె.కాంచనమాల, పలివేల శివాజీ తెలిపారు.

చెత్త తొలగించారు



వేలంకలో చెత్తను తొలగించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్

కిర్లంపూడి: వేలంక రహదారి పక్కన చెత్త వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు తడి, పొడి వ్యర్థాలు రోడ్డు పక్కనే వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై శనివారం 'దుర్గంధం భరించలేకపోతున్నాం..' శీర్షికతో శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈఓపీఆర్డీ సత్యప్రసాద్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి యు.పెద్దకాపు శానిటేషన్ సిబ్బందితో చెత్తను తొలిగించి, బ్లీచింగ్ చల్లించారు.

గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు



ఎస్.అన్నవరంలో స్వచ్ఛాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, తదితరులు



మల్లవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ శివరామకృష్ణయ్య, సిబ్బంది



సిరిపురంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తుని రూరల్: మండలంలో మూడో శనివారంను పురష్కరించుకుని వివిధ గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్.అన్నవరంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, ఎంపీడీఓ కె.సాయినవీన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులతో కలసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వాటిల్లే కాలుష్యం, వాతావరణ సమతుల్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డబుల్ డస్ట్ బిన్నుల వినియోగం, పరిసరాల పరిశుభ్రతపై మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు. కేఓ.మల్లవరం, రాపాక, తేటగుంట, వి.కొత్తూరు, రేఖవానిపాలెం, చామవరం, డి.పోలవరం, లోవకొత్తూరు, హంసవరం తదితర గ్రామాల్లో స్థానికులచే ప్రతిజ్ఞ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, స్థానికులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రౌతులపూడి: ప్రజలంతా తమ చుట్టూ ఉన్న పరిసరాలతోపాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య అన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిడజాం, ఎ.మల్లవరం గ్రామాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక సిబ్బంది, నాయకులతో కలసి ఆయన పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలపి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పెద్దలు లెక్కల రాము, పల్లి కుమార్‌బాబు, గవిరెడ్డి గురునాథ్, సచివాలయ సిబ్బంది,ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సిరిపురం గ్రామంలో శనివారం పారిశుధ్య పనులు చేశారు. చీపుళ్లతో రోడ్లను పరిశుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతల నూకరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, కార్యదర్శి సత్యనారాయణ, చిలకమర్తి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: గ్రామంలో రోడ్లపైన కాని, వీధుల్లో కాని, దుకాణాల వద్ద కాని చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటామని జగ్గంపేట ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర –స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం జగ్గంపేట మెయిన్‌రోడ్డులోను, పలు వీధుల్లోను మండల అధికారులు నిర్వహించారు. మెయిన్‌రోడ్డును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జెవిఆర్ రమేష్,ఈఓపిఆర్‌డి భాస్కరరావు,పంచాయితీ కార్యదర్శి శివ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో పర్యవరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని పల్లెల్లో శనివారం అధికారులు స్వచ్ఛ ఆంధ్రా – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని సచివాలయ పరిధిలో సచివాలయ సిబ్బంది, అంగన్ వాడీ వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శనివారం జరిగిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలంతా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.